
# రాజుగారి కుక్క

శివప్రాణి



పార్వతమ్మకి స్వంతంగా అభిప్రాయాలంటూ ఏవీ లేవు. ఏ విషయంలో అభిప్రాయాలు లేకపోయినా పార్వతమ్మకి భర్తమీద మాత్రం సదభిప్రాయం లేదు.

అలాగే పరంధామయ్యకి కూడాను. కట్టుకున్న పెళ్ళాంకంటే కాట్లోనున్న కర్రపుల్లకయినా సరే ఎక్కువ విలువనిచ్చే రకం. అందరి మాటలకీ గంగిరెద్దులాగ తల వూపే పరంధామయ్య కనకరాజుగారి పాదధూళి నెత్తిన చల్లుకుంటాడంటే అందులో ఆశ్చర్యపడవలసిన విషయం లేదు.

కనకరాజు గారి పాదధూళి పరంధామయ్య అనే మాటేమిటి? ఎవరైనా నెత్తిన చల్లుకుంటారు. అందుకు కారణం అతనొక పెద్ద కంపెనీకి అతి పెద్ద ఆఫీసరవటమే.

కనకరాజుగారి యెడల పరంధామయ్యకి ఎంత గురి వుందో అతను వారి కుక్కను ఎత్తుకుని నడుస్తున్న తీరు చూస్తే అర్థమయిపోతుంది. పెద్దవాల్తేరులో వున్న కనకరాజుగారి యింటినుంచి కొత్తరోడ్డు మొగదలలో వున్న తన యింటికి పరంధా

---

కుక్కని సాక్షాత్తూ అల్లుడిలా చూసి గౌరవించినందుకు నేర్చుకున్న గుణపాఠం!

---

మయ్య బస్సుమీద రావచ్చు! ఆటోలో రావచ్చు. రిక్షాలో రావచ్చు, గానీ ఇంకెలా వచ్చినా రాజుగారి కుక్కకి అసౌకర్యంగా వుంటుందేమోనని దాన్ని చంకలో చంటిపిల్లనెత్తుకున్నంత జాగ్రత్తగా ఎత్తుకొని, ఈదురోమంటూ తన కొంపకి నడుచుకొని వచ్చేడు పరంధామయ్య.

"ఛీ.. ఛీ.. ఛీ.. ఛీఛీ.." కుక్కని కసిరినటు కసిరింది పార్వతమ్మ.

ఆ కసుర్లు కుక్కతో బాటు, దాన్ని ఎత్తుకున్న పరంధామయ్యకి కూడా తగిలేయి.

పార్వతమ్మ మొహం చూసి కుక్క గుర్రుమంది. దాని కడుపులోని పేగుల కదలిక మోచేతులకు తగిలి పరంధామయ్య ఒళ్ళు జలదరించింది. ఒదిలెయ్యబోయి, మళ్ళీ అది ఎవరి కుక్కో గబుక్కున గుర్తొచ్చి ఆగాడు.

రోజూ సాయంత్రం ఇంటికి రాగానే తాను కూర్చొనే వాలుకుర్చీలో........అంత వరకూ చంకలో పొందికగా కూర్చొని దిక్కులు చూస్తున్న కుక్కని మెల్లగా దించాడు.

"హిజ్ మాస్టర్స్ వాయిస్" కుక్క లాగ కూర్చొని అదోకసారి నిర్లక్ష్యంగా పార్వతమ్మగారి వైపు చూసింది.

డబ్బు, అధికారం వున్నవారిలాగే. వారి పెంపుడు జంతువులకి కూడా (ముఖ్యంగా కుక్కలకి) తమ అడుగులకి మడుగులొత్తే వారెవరో, తమని విమర్శించే వారెవరో తొలిచూపులోనే తెలిసిపోతుంది కాబోలు!

"మన రాజుగారు లేరే?...."

"ఊం.. ఏం పాపం? ఏంవయ్యిందేవిటి?...."

"అబ్బ.. అది కాదే.. వారు తిరుపతి గట్టా వెళుతూ వాళ్ళ కుక్కని ఎక్కడుంచడమా అని మథనపడుతూ వుంటే హఠాత్తుగా నేను గుర్తుకొచ్చేనట...."

"అఘోరించలేకపోయాస...."

"ఎవరు?" అని పరంధామయ్య అడగలేదు.

మళ్ళీ పార్వతమ్మే అందుకొంది.

"లేకపోతేన్ట....ఆయనకి బుద్ధి లేకపోతే మీ బుద్ధేమిటయ్యింది....మీకు లేకపోతే ఆ రంకుముండ బుద్ధి ఏంవిటయ్యింది. రాక్షసి ముండ! నిజుమంటే మన పెద్దబ్బాయి ఎత్తులో వుంది. తగుదునమ్మాఅని మీ చంకలో కూర్చొని మిడుతుం మిడుతుం చూస్తుందా?"

"తిట్టకే...వినగలదు....అది రాజుగారి కుక్క!"

"ఏం? నాకేం భయమా? మీ రాజుగారినే తిడతాను. ఎంత రాజుగారి కుక్కయితే మాత్రం అన్ని కుక్కల్లాంటిది కాదూ అది?"

"బాబ్బాబు.... ఈ నాల్రోజులు నా ఆబోరు దక్కనీయి. దీన్ని పువ్వుల్లో పెట్టి రాజుగారికి అప్పగించకపోతే నా పీక పోతుంది. దీనికేమయినా అయితే నా ఉద్యోగం పోతుంది...." పరంధామయ్య తన జీవితంలో తొలిసారిగా పెళ్ళాన్ని బ్రతిమాలేడు.

ఎప్పుడో పూర్వాశ్రమంలో కనకరాజు గారికి పరంధామయ్యకి పరిచయం వుండేదట! కనకరాజు అప్పలాచారిగారింట్లో కిందవాటాలో వుండేటప్పుడు పరంధామయ్య ఆ పక్కవాటాలో వుండేవాడు. అబ్బో! ఇదెప్పటిమాట! ఇరవై ఏళ్ళ క్రిందటి సంగతి!

ఇప్పుడు కనకరాజు 'గారు' అయ్యారు. అంతస్థుమారి, రెండంతస్థుల 'ప్రిన్స్లీ'లో వుంటున్నారు.

అయినా ఏమాట కామాటే చెప్పుకోవాలి. ఇప్పటికీ ఎప్పుడు కనబడినా పరంధామయ్యని పలకరించి మాట్లాడతారు. (పరంధామయ్యని వంటింటి రాచ్చిప్పలోవి వుప్పులాగ. పెరట్లోని కరివేపాకు రెబ్బలాగ వాడుకుంటారని ఎవరైనా విమర్శిస్తే అది వేరే సంగతి.)

కనకరాజు గారంతటి వారు తనని పలకరించటం పరంధామయ్య లాంటి వారికి గొప్పంటే గొప్పకాదూ మరి!

తనకి సాయంత్రం కాఫీ కలపటానికి వుంచిన పాలు, రాత్రి తోడు వెయ్యవలసిన పాలు.. రెండూ కలిపి.. దగ్గరగా ఓడ్చి.. ఓ వెండి తామరాకులో పోసి మడత కుర్చీ కెదురుగా పెట్టేరు. కుక్కని మెల్లగా దించేరు.

నాలికతో నాలుగుసార్లు చప్ చప్మని అక్కడికి ఆపి వెనక్కి తిరిగి కూర్చుంది రాజుగారి కుక్క.

పరంధామయ్య బ్రతిమాలేడు మీగడ కూడా ఒంపేశారు. పంచదార కలిపేరు.

అబ్బే! కుక్క కదలందే.

అలకపాన్పు ఎక్కిన అల్లుడిలాగ వులకదు.... పలకదు....

ఏం చెయ్యాలో తోచని పరంధామయ్యకి కళ్ళలో నీళ్ళు ఒక్కచే తక్కువ అయ్యాయి.

ఇది ఇలా తిండి తిప్పలు మానేసి కూర్చుంటే రాజుగారు తిరిగి వచ్చేవేళకి తనలా తయారవుతుందేమోనని ఆయన భయం.


నోవాటాల్క్ మిమ్మల్ని మృదువుగా, తాజాగా వుంచుతుంది.




నోవా అందాన్ని మెరుగుపరుస్తుంది. సువాసనలు వెదజల్లుతుంది. నోవా టాల్క్ యొక్క మెత్తదనం మీ మృదువైన శరీరానికి ఉల్లాసాన్నిస్తుంది. అందుచేతనే పాపాయి కు, స్త్రీలకు అది నమ్మతగినది.

నోవా కంపెనీ,

ల్ బహదూర్ శాస్త్రి మార్గ్,

బందూప్, బొంబాయి-400 078.

సంప్రదాయ మాధురి

## మందార మకరందాలు

శ్లో॥ కింవాససైవం న విచారణీయం।
వాసః ప్రధానం ఖలుయోగ్యతాయాః॥
పీతాంబరం వీక్ష్య దదౌ తనూజాం।
దిగంబరం వీక్ష్య విషం సముద్రః॥

ఎలాటి వస్త్రాలు ధరిస్తే నేమి అనుకోడం తప్పు. ఒకరి యోగ్యతను లోకం అతని దుస్తులను బట్టే నిర్ణయిస్తుంది. సముద్రుడు పట్టు పీతాంబరం కట్టుకున్న విష్ణుమూర్తిని చూసి పిల్లనిచ్చేడు. దిగంబరుడైన శివుని చూసి కాలకూట విషం యిచ్చేడు. ఇదే లోకరీతి!

కంఠస్థం చేయాలి

బుజుపేటకెళ్ళి చిక్కటి పోజిబుల్ పాలు కొనుక్కొచ్చి.... దగ్గరగా.... ఎర్రగా.... కాగబెట్టి.... పంచదారవేసి.... గుజ్జుగా పాలు అన్నం కలిపి వెండి తామరాకులో పెట్టారు.

కార్యం పెళ్ళి కొడుకులాగ సుతారంగా నాలుగు మెతుకులు ఎంగిలి పడింది రాజుగారి కుక్క.

చేసేదిలేక తన మంచం శుభ్రంగా దులిపి బూరుగుదూది తలగడా నిలువునావేసి దాని మీద పడుకోపెట్టారు దాన్ని.

రాజుగారి కుక్కగారు తెల్లవార్లూ మేలుకొని వుండటానికి కారణం ఆకలేనని పరంధామయ్య నమ్మకం.

ఆయన కళ్ళు ఎర్రబడ్డాయి. నిద్రలేమితో.

తెల్లవారు ఝామున గుమ్మం కడగటానికి వచ్చిన పనిమనిషికి పది రూపాయలిచ్చి ఆ పూటకి మాంసం వండి తెమ్మన్నారు.

"ఇదుగో చూడూ.. మరోలా అనుకోకు కాని.... ఇందులో నువ్వేమీ వెరితి పడకు.... కనీసం ఇదైనా, కడుపునిండా తింటే రెండు పూటలా నువ్వే వండి పెడుదూగాని.. నీ కష్టం వుంచుకోనులే.."

బ్రాహ్మణీకం మంట కలుపుకునేందుకికూడా సిద్ధపడ్డాడు పరంధామయ్య.

ఆఫీసుకెళుతూ పెళ్ళానికి వెయ్యి అప్పగింతలు పెట్టి వెళ్ళి.... వుండబట్టలేక సాయంత్రం గంట పెర్మిషన్ పెట్టి ఇంటికి వచ్చేశాడు.

పరంధామయ్య తమ సందులోకి మలుపు తిరిగేసరికి రాజుగారి కుక్క వీధిలోనే దర్శనమిచ్చింది.

అది ఎదురింటి వారి 'డాలీ'తో స్నేహం కట్టే వుద్దేశంలో వున్నట్టు కన్పడుతోంది. రాజుగారి కుక్కకి ఆడ స్నేహితులు లేరని కాదు కాని, దాని స్నేహం అంతా హైక్లాస్ సొసైటీతోనే. ఇటువంటి 'కంట్రీగాళ్'ని అది చూసి ఎరగదు.

ఎందుకోకాని, పక్కింటివారి కుక్కకి ఈ విషయంలో అభ్యంతరం వున్నట్టు కన్పడుతోంది, అందుకే తెగ అరుస్తోంది.

"నేను ఈ వీధి కుక్కని.... నేనూ ఇదీ యింతప్పటినుంచీ కలిసి తిరిగేం.... ఆఁవటా!" అంటుంది పక్కింటి వారి కుక్క.

"లవ్ ఎట్ ఫస్ట్ సైటు" మీద లెక్చరిస్తోంది రాజుగారి కుక్క.

"యూ హౌమచ్ అంటే యూ హౌమచ్" అనుకొన్నాయి.

"ఐ దిస్ మచ్ అంటే ఐ దట్ మచ్" అనుకొన్నాయి.

ఆఖరికి, "భౌ" అంటే "భౌ" అనుకొన్నాయి.

గాభరాగా ఫెడల్ కొట్టి రెండు కుక్కలకీ మధ్యన సైకిలాపిన పరంధామయ్య బాలన్సు తప్పి పక్కింటి వారి కుక్కమీద పడ్డాడు.

అది కుఁయోమంటూ పారిపోయింది.

ఆ గాభరాలో ఎదురింటివారి 'డాలీ'తోక ముడుచుకొని పారిపోయింది.

సైకిలు స్టాండువేసి, రాజుగారి కుక్కని చంకనెత్తుకొని ఎదురింట్లో జొరబడ్డాడు పరంధామయ్య.

"మీ కుక్క అంతరం ఎంత? మా రాజుగారి కుక్క అంతరం ఎంత? అంతస్తులు తెలుసుకొని మసలమని మీ కుక్కకి చెప్పండి........ఆఁ...." జరిగిన దేమిటో వాళ్ళు తెలుసుకొనే లోగానే తమ వాటాలోకి వచ్చేశాడు పరంధామయ్య.

5000-00 విలువగల ఆకర్షణీయమైన బహుమతులు గెలవండి: ఎంట్రీ ఫీజు లేదు.

సహాయమునకు 38 మొదటి బహుమతి వాచీలు, కెమెరాలు, టేపు రికార్డర్, రికార్డు మొత్తముగల నమూనా ప్లేయర్స్, జపాన్ మోడల్ ట్రాన్సిస్టర్ మొదలైన వాటిలో ఏదైనా ఒకటి. కన్సొలేషన్ బహుమతి: అమెరికన్ డిజైన్ చీరలు ధర రు. 70. అమ్మకం ధరపై. ఇతర వాటితో వేరుగావున్న ప్రత్యేక సొల్యూషన్‌కు మొదటి బహుమతి. అదే సొల్యూషన్‌కు కన్సొలేషన్ బహుమతి వుండును. ఇది ఒక సేల్సు ప్రమోషన్ పథకం. ప్రమోటర్ల తీర్మానము ఖాయమైనది. క్లోజింగ్ తేదీ : 30-4-77

| | | | |
|---|---|---|---|
| 2 | 17 | 13 | 5 |
| 12 | 7 | 8 | 11 |
| 9 | 10 | 13 | 6 |
| 15 | 4 | 3 | 16 |

తెల్ల కాగితముపై పదహారు ఖాళీ గడులను నమూనాలో వున్న విధంగా తయారుచేసి 14 (పదునాలుగు) నుంచి 29 (ఇరువది తొమ్మిది) వరకుగల అంకెలను ఒకేసారి ఉపయోగించి నిలువుగా, అడ్డముగా, అయిమూలగా ఎటు కూడినా మొత్తం 86 (ఎనభై ఆరు) వచ్చునట్లు అమర్చాలి. ఫలితాలు ప్రకటించిన వెంటనే బహుమతి గెలిచినవారు ఆయా బహుమతులకు పోస్టేజి, ప్యాకింగ్ ఫీజులు చెల్లించుటకు తెలియపర్చబడును. బహుమతులు గెలుపొందినట్లు పంపు ఉత్తరంలో తెలియపర్చబడిన పద్ధతికి లోబడి బహుమతులు పంచబడును. ఒక కుటుంబము ఒక ఎంట్రీ మాత్రమే పంపాలి. మొట్టమొదటి ఎంట్రీకి రు. 101/-లు స్పెషల్ బహుమతి ఇవ్వబడును.

Usha Textiles (WAJ-86-30) P. B. 9406, Delhi-110051

చిటుకులు:

## వాడు - వీడు



మామిడి పూతను చూసి హడలిపోతాడు,
మండువేసవి వస్తోందని మనాదితో వాడు—
మండుటెండల్ని చూసి మురిసిపోతాడు,
మామిడిపండ్ల సీజన్ వస్తోందని వీడు.

—భండారు పర్వతాలరావు

ఆ తర్వాత....

పరంధామయ్య అయిదు రోజులు సిక్ లీవ్ పెట్టేశాడు. కుక్కని చూస్తూ, దాని గురించి ఆలోచిస్తూ.... లీవ్ లెటర్‌లో "సఫరింగ్ ఫ్రం డాగ్" అని వ్రాశాడు

* * *

ఆ రోజు పొద్దున్నే రాజుగారు తిరుపతి నుంచి తిరిగొచ్చేరని తెల్సింది.

సాయంత్రం కుక్కని చంకబెట్టుకొని రాజుగారింటికి బయల్దేరాడు పరంధామయ్య.

గుమ్మం దాటగానే ఎదురింటి 'డాలీ' ఎదురొచ్చింది.

రాజుగారి కుక్క చంకలోంచి ఒక్క ఎగురు ఎగిరింది.

దాని వెనకాతల పడి నడుం పట్టుకోబోయాడాయన.

అది "గఁయ్"మని, వెనక్కి తిరిగి, ఆయన చెయ్యి కరిచి .... చురుక్కుమనే లాగ చూసింది.

"కెవ్వు" మన్నాడు పరంధామయ్య.

జాతి కుక్కలు అంత అసహ్యంగా.... అంత వికృతంగా....ఇగుళ్ళు కనిపించేటట్టు చూడగలవని పరంధామయ్యకి తెలియదు.

కసిగా ఎదురింటివారి కుక్కని తగిలేసి, బాధగా చేతికి రుమాలు చుట్టుకొని....వినయంగా కుక్కని చంకనేసుకొని బయల్దేరాడు.

అదృష్టం!

గుండు తడుముకొంటూ రాజుగారు ఇంటి దగ్గరే వున్నారు.

అలా అలా యధాలాపంగా చెప్పినట్టు అంతా తు. చ. తప్పకుండా రాజుగారికి విన్నవించుకొన్నాడు పరంధామయ్యగారు.

ఆ విన్నపంలో కుక్కమీద కంప్లైంటు కంటే తన శ్రమకి గుర్తింపు కావాలనే తాపత్రయం చాలా వున్నట్టు వాసన కనిపెట్టేరు కనకరాజుగారు

అంతా వింటూ చిద్విలాసంగా చిరునవ్వు నవ్వుతున్న కనకరాజుగారు, కుక్క కరిచిందన్న మాట విని గట్టిగా నవ్వారు. పకపకా నవ్వారు. పగలబడి నవ్వారు.

ఆ అదురుకు. కొండ శిఖరాన కందిన మొహంతో చూస్తున్న సూర్యుడు పట్టు తప్పి అటు ప్రక్క కిందకు జారిపోయాడు. ఒక్కసారి చీకట్లుకమ్మి ప్రకృతి నల్లబడింది పరంధామయ్య మొహంలాగే.

అతికష్టం మీద నవ్వు ఆపుకొన్నారు కనకరాజుగారు.

"మీ శ్రీమతిగారు చెప్పినట్టు.... మీకు బుద్ధిలేదండీ పంతులుగారూ ...."

వెయ్యి కుక్కలు ఒక్కసారి మీదకు దుముకుతున్నట్టు ఫీలయ్యాడు పరంధామయ్య.

"లేకపోతే ఏఁవిటండి ఇదంతా? వెధవది.... కుక్కని కుక్కలా చూడక అలా నెత్తిన పెట్టుకొంటార్టండీ?"

"మరి.... మీరంత ముద్దుగా చూసుకొంటారని...." నసుగుతున్నాడు పరంధామయ్య.

"మీ అమాయకత్వం కూలా! నా కుక్కని నేను ముదు చెయ్యనటండీ? కుక్కని మీ ఇంట్లో వుంచమని చెప్పేను కాని.... ఈ అల్లుడి మర్యాదలన్నీ చెయ్యమన్నా నటండీ? ఎంత, నా కుక్కయితే మాత్రం నన్ను చూసినట్టు చూస్తారా? అంటే కుక్కని, నన్నూ ఒక్కలాగే చూస్తారన్న మాట!!!...."

కనకరాజుగారు ఒళ్ళంతా కదిలేటట్టు నవ్విన నవ్వుకో—

లేక,

ఆయన ఆఖర్న విసిరిన విసురుకో,

పరంధామయ్య తట్టుకోలేక కుర్చీలో కూలబడ్డాడు!

వీధిలో.

రాజుగారి కుక్క ఎందుకో మొరుగుతోంది!!

★

